

పట్టువస్త్రాలను తీసుకెళ్తున్న పోచారం దంపతులు

# వైభవంగా శ్రీవారి కల్యాణం

- తెలంగాణ తిరుమల తిరుపతి ఆలయంలో వేడుకలు
- సతీసమేతంగా పాల్గొన్న మాజీ స్పీకర్ పోచారం

నస్రుల్లాబాద్, మార్చి17: బీర్కూర్ మండలంలోని తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానంలో ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిదండి దేవనాథరామానుజ జీయర్ స్వామి ఆధ్వర్యంలో విశేష పూజలు కొనసాగాయి.అనంతరం మాడ వీధుల్లో హనుమ, గరుడ వాహనాలపై స్వామి వారిని ఊరేగించారు. ఆలయ ధర్మకర్త మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, ఆయన సతీమణి పుష్ప పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వేడుకల్లో డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, ఆలయ ధర్మకర్త శంభురెడ్డి, రాష్ట్ర నాయకుడు సురేందర్‌రెడ్డి, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## పోలింగ్ శాతం పెంపునకు కృషి చేయాలి:కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, మార్చి 17: ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు రాజకీయ పార్టీలు కృషి చేయాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ కోరారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఓటు వేయడానికి 12 రకాల గుర్తింపు కార్డులను ఉపయోగించుకోవచ్చని, దీనిపై రాజకీయ పార్టీలు విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఏప్రిల్ 18 నుంచి 25వ తేదీవరకు నామినేషన్ల స్వీకరణ, 26న నామినేషన్ల పరిశీలన, 29న ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. ఎన్నికలకు 72 గంటల ముందు ప్రచారాన్ని ముగించాలని సూచించారు. కార్యక్రమంలో రాజకీయ నరేందర్, ప్రభాకర్‌రెడ్డి, కాశీంఅలీ, మదన్‌లాల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

నిజాంసాగర్, మార్చి17: గాయత్రీ షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. మండలంలోని మాగి గాయత్రీ ఫ్యాక్టరీ సమీపంలో కార్మికులతో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్ర యాజమాన్యం చేతిలో పనిచేసే ఇక్కడి కార్మికులు వెట్టి చాకిరి చేస్తున్నారని, ఈ ప్రాంత రైతులు తమ భూములను ఫ్యాక్టరీకి విక్రయించి నేడు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని తెలిపారు. ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులకు 12 నెలలపాటు వేతనాలు చెల్లించాలన్నారు. అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని, కార్మికులకు దుస్తులు, బూట్లతోపాటు అన్ని బెనిఫిట్స్ యాజమాన్యం అందజేయాలన్నారు. సమావేశంలో నాయకులు మల్లికార్జున్, రవీందర్‌రెడ్డి, మనోజ్‌పటేల్, గుర్రుపు శ్రీనివాస్, ఖాలిక్, సుధీర్ చోప్రా, సాయిలు, శేఖర్, పండరి, ప్రవీణ్, కొర్కంటి రాములు, మెంగారం శ్రీనివాస్, పిట్లం మండల నాయకుడు రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సెస్సీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఎల్లారెడ్డి రూరల్/ పిట్లం/ పెద్దకొడప్‌ల్, మార్చి 17: జిల్లావ్యాప్తంగా నేటి నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఎల్లారెడ్డిలోని మూడు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 732మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని ఎంఈవో వెంకటేశం తెలిపారు. పిట్లంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ఉర్దూ మీడియం పాఠశాలలో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాల్లో మొత్తం 539 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని ఎంఈవో దేవీసింగ్ తెలిపారు. పరీక్ష సమయంలో జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని పెద్దకొడప్‌గల్ తహసీల్దార్ దశరథ్, ఎస్సై కోనారెడ్డి సూచించారు. ఉదయం 9:30నుంచి 12:30గంటల వరకు పరీక్ష ఉంటుందని, విద్యార్థులు పరీక్షా సమయానికి అరగంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నిజాంసాగర్, మార్చి17: మహ్మద్‌నగర్ గ్రామానికి చెందిన మంగ ఎల్లయ్య అనుమతి లేకుండా ఇసుకను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై సుధాకర్ ఆదివారం తెలిపారు. ఆయనపై కేసు నమోదు చేశామన్నారు.

# అకాల వర్షం.. అపార నష్టం

- జిల్లావ్యాప్తంగా భారీ వర్షం
- పలుచోట్ల వడగండ్ల వాన
- వేల ఎకరాల్లో పంటనష్టం



గొట్టిముక్కలలో పంటలను పరిశీలిస్తున్న ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ



మాందాపూర్‌లో నేలకొరిగిన మక్కజొన్న పంట




కిష్టాపూర్ గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి



రాజంపేట మండలంలో కొట్టుకుపోయిన రేకులు



భిక్కనూరులో ఇంటిపై కూలిన చెట్టు



తెల్గాపూర్ శివారులో నేలవాలిన జొన్న



తిమ్మాపూర్ రోడ్డుపై కూలిన వృక్షం

నమస్తే తెలంగాణ యంత్రాంగం, మార్చి 17: అకాల వర్షాలు తీవ్ర నష్టాన్ని తెచ్చాయి. జిల్లా వ్యాప్తంగా శనివారం రాత్రి కురిసిన భారీ వానకు పంటలు దెబ్బతిన్నాయి. బలమైన ఈదురు గాలులు, వడగండ్లతో వరి ధాన్యంతోపాటు మామిడి, జామ కాయలు నేలరాలాయి. మక్కజొన్న, జొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పంటలు చేతికందే సమయంలో నష్టపోవడంతో రైతులు కంటతడిపెట్టారు. బీర్కూర్ మండలంలో 4831 ఎకరాలు, నస్రుల్లాబాద్ మండలంలో 2835 ఎకరాల వరి పంట దెబ్బతిన్నట్లు ఏవోలు కమల, నరేంద్ర తెలిపారు. ఈదురు గాలులకు బీర్కూర్ శివారులోని ఓ రైస్‌మిల్ పైకప్పు ఎగిరిపోగా ధాన్యం బస్తాలు తడిసి సమారు రూ. కోటి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. బీర్కూర్ మండల పరిధిలో దెబ్బతిన్న పంటలను మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి పరిశీలించారు.

బాన్సువాడ మండల పరిధిలో 350 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయాధికారి సుధాకర్ తెలిపారు. మొత్తం 413 మంది రైతులకు చెందిన 238 ఎకరాల్లో వరి, 52 ఎకరాల్లో జొన్న, 60 ఎకరాల్లో మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లిందని చెప్పారు.

దోమకొండ మండలం గొట్టిముక్కల గ్రామంలో దెబ్బతిన్న పంటలను ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పరిశీలించారు. సీఎంతో మాట్లాడి పంటలు నష్టపోయిన రైతులందరికీ సాయమందేలా చూస్తానని షబ్బీర్ అలీ హామీ ఇచ్చారు.

కామారెడ్డి రూరల్ మండలం చిన్నమల్లారెడ్డిలో పంటలను ఎమ్మెల్యే కాటిపల్లి పరిశీలించారు.

భిక్కనూరు మండలంలో వరి, మక్కజొన్న, బొప్పాయి, జామ పంటలకు నష్టం వాటిల్లింది. దెబ్బతిన్న పంటలను కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ, వ్యవసాయ శాఖ అధికారి రాధారెడ్డి తదితరులు పరిశీలించారు. పలు గ్రామాల్లో చెట్లు, కరెంటు స్తంభాలు నేలకూలాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కరెంటు సరఫరాను పునరుద్ధరించేందుకు అధికారులు, సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. బీబీపేట్ మండలంలో రెండు ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. వరి, మక్కజొన్న పంటలు ధ్వంసమయ్యాయి. రాజంపేట మండలంలో మక్కజొన్న, వరితోపాటు టమాట, మిర్చి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కళ్లాల్లో ఆరబెట్టిన పంటలు తడిసి ముద్దయ్యాయి. ఈదురు గాలులకు రేకుల షెడ్లు ఎగిరిపోయాయి. చెట్లు నేలకూలాయి. విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో కరెంటు సరఫరా నిలిచిపోయింది.

నిజాంసాగర్ మండలంలో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి సింగీతం, తెల్గాపూర్ శివారులో జొన్న పంట నేలవాలింది. నిజాంసాగర్ మండలంలో 17 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏవో అమర్‌ప్రసాద్ తెలిపారు. జిల్లాలో అత్యధికంగా కామారెడ్డి జిల్లా పాత రాజంపేటలో 34 మి.మీ., బీర్కూర్‌లో 21 మి.మీ., నస్రుల్లాబాద్‌లో 18.5 మి.మీ., బొమ్మన్‌దేవ్‌పల్లిలో 15.5 మి.మీ., గాంధారి మండలం రామ్‌లక్ష్మణపల్లిలో 11 మి.మీ., మాచారెడ్డి మండలం లచ్చాపేటలో 10.8 మి.మీ., పిట్లంలో 7.3మి.మీ., మద్నూర్ మండలం మెనూర్‌లో 7 మి.మీ., బిచ్కుంద మండలం పుల్కల్‌లో 6.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

పిట్లం మండలంలో రెండు రోజులుగా చిరుజల్లులు కురుస్తున్నాయి. కాగా చేతికి వచ్చిన పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. శనివారం రాత్రి కురిసిన వర్షానికి డోంగ్లీ మండలంలో జొన్న పంటకు నష్టం వాటిల్లింది. వడగండ్ల వానకు జొన్న నేలకొరగడంతో కంకులను రైతులు ఆదివారం కోసి రోడ్డుపై ఆరబెట్టారు. కంకి తడవడంతో జొన్నలు నల్లగా మారుతాయని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం జొన్నలను కొనుగోలు చేయాలని కోరుతున్నారు. సదాశివనగర్ మండలంలో ఈదురు గాలులకు పంట నష్టం జరిగిందని రైతులు వాపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



కొల్లూరు శివారులో పంటలను పరిశీలిస్తున్న అధికారులు



డోంగ్లీలో తడిసిన జొన్న కంకులను ఆరబెట్టిన రైతులు

## ఆటోను ఢీకొన్న లారీ

ఆరుగురికి గాయాలు

గాంధారి, మార్చి 17: ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో ఆరుగురికి గాయాలైన ఘటన గాంధారిలో ఆదివారం చోటు చేసుకున్నది. గాంధారి ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడ మండలం కొయ్యగుట్ట తండాకు చెందిన 12 మంది పెళ్లిచూపుల నిమిత్తం గాంధారి మండలంలోని తప్పుతండాకు వచ్చి తిరిగివెళ్తున్నారు. ఈ క్రమంలో గాంధారిలోని మార్కెట్ కమిటీ సమీపంలో మూలమలుపు వద్ద చద్మల్ తండా వైపు నుంచి మైనింగ్ మట్టిని తరలిస్తున్న లారీ వెనుక నుంచి ఢీకొన్నది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న కొయ్యగుట్ట తండాకు చెందిన దౌర్య సీతారాం, నిర్మల, జీవన్, శాంతాబాయి, బదుసింగ్, లీలా, కెతావత్ తారకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో గాంధారి ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఓవర్ లోడ్‌తో వెళ్తున్న వాహనాలను నియంత్రించాలని మండలవాసులు కోరుతున్నారు.



ప్రమాదంలో ధ్వంసమైన ఆటో

## గోర్గల్ మైసమ్మకు బోనాల సమర్పణ

ఉత్సవాల్లో పాల్గొన్న బీఆర్‌ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే షిండే

నిజాంసాగర్, మార్చి 17: మండలంలోని గోర్గల్ గ్రామంలో నిర్వహిస్తున్న మైసమ్మ ఆలయ వార్షికోత్సవాల్లో జహీరాబాద్ ఎంపీ బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన బోనాల ఊరేగింపులో పాల్గొన్న అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీలు ఎలా మోసం చేస్తున్నాయో ప్రజలు గమనించాలని, రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి, నాయకులు దుర్గారెడ్డి, మనోహర్, నర్సింహారెడ్డి, విఠల్‌రెడ్డి, రమేశ్ గౌడ్, విజయ్, అంజయ్య, రాజు, సాయిలు, శ్రీకాంత్‌రెడ్డి, సుభాష్, దేవేందర్‌రెడ్డి, ప్రకాశ్ పాల్గొన్నారు.

## ఆర్థికసాయం

భిక్కనూరు, మార్చి17: మండలంలో తిప్పాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ కార్యకర్త శామర్తి రామయ్య మృతిచెందగా బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ రూ. 5వేల ఆర్థికసాయం చేశారు. ఆర్థికసాయం డబ్బులను స్థానిక నాయకులు అందజేశారు. కుటుంబ సభ్యులను ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సాయిరెడ్డి, విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, చిన్న నర్సారెడ్డి, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, రత్నం, నర్సారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పరామర్శించారు.

## వైద్య శిబిరానికి విశేష స్పందన

బీబీపేట్, మార్చి 17: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో మండలంలోని మాల్కాపూర్ గ్రామంలో ఆదివారం అరుణోదయ దవాఖన ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పాండ్యన్ పర్యవేక్షణలో 60 మందికి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీచేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ నాగరాజ్‌గౌడ్, మండల చైర్మన్ నాగేశ్వర్, వైస్ చైర్మన్ స్వామి, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## బెల్టు షాపులపై దాడి

నిజాంసాగర్/ఎల్లారెడ్డి రూరల్, మార్చి17: మహ్మద్‌నగర్ మండలంలోని తున్కిపల్లిలో నిర్వహిస్తున్న బెల్టు షాపుపై నిజాంసాగర్ ఎస్సై సుధాకర్ సిబ్బందితో కలిసి ఆదివారం దాడిచేశారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు సాయిబాబా దుకాణం నుంచి 33లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఎల్లారెడ్డి మండలంలోని శివ్వానగర్‌లో వంజరి హరీశ్‌కుమార్, తిమ్మారెడ్డి గ్రామంలో బుడిమె శివకుమార్, రుద్రారంలో బయ్యగోని దుర్గయ్య నిర్వహిస్తున్న బెల్టు షాపులపై ఎస్సై బొజ్జ మహేశ్ ఆధ్వర్యంలో ఏఎస్సై నర్సింగ్‌రావు, సిబ్బంది దాడిచేశారు. రూ.15వేల విలువైన మద్యం పట్టుకొని సీజ్ చేశామని ఎస్సై తెలిపారు. అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

**29 మద్యం బాటిళ్ల పట్టివేత..**

కామారెడ్డి, మార్చి 17 : జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన ధాత్రిక ప్రభాకర్ మద్యాన్ని అక్రమంగా నిల్వచేసి విక్రయిస్తుండగా పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. 29 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

రామారెడ్డి, మార్చి17: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు ఆదివారం అప్పగించినట్లు ఎస్సై విజయ్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన చాతరబోయిన నర్సింహులు, రెడ్డిపేటకు చెందిన చిరంజీవి ఇటీవల సెల్‌ఫోన్ల పోగొట్టుకున్నాడు. పూర్తి వివరాలతో పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో వారు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి బాధితులకు అందజేశారు.

# ఎనిమిదేండ్లుగా 100% ఉత్తీర్ణత

తొమ్మిదోసారీ వంద శాతం ఉత్తీర్ణతే ధ్యేయంగా ఉత్తమ బోధన

విద్యార్థులను సంసిద్ధం చేసిన ఉపాధ్యాయులు

ఆదర్శంగా నిలుస్తున్న నిజాంసాగర్ కస్తూర్బా పాఠశాల



నిజాంసాగర్, మార్చి 17 : డ్రాపౌట్లు, గ్రామీణ బాలికలను అక్కున చేర్చుకునే పాఠశాల కస్తూర్బా. అయినప్పటికీ పదో తరగతిలో ఏనిమిదేండ్లుగా వందశాతం ఉత్తీర్ణత సాధించి ఆదర్శంగా నిలిచింది నిజాంసాగర్ కేజీబీవీ. ఈ విద్యాసంవత్సరం కూడా పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. ఈ పాఠశాలలో 2011-12 విద్యాసంవత్సరంలో మొట్ట మొదటి పదో తరగతి బ్యాచ్ పరీక్షలు రాసింది. మౌలిక వసతులు, స్టాఫ్, విద్యార్థుల హాజరు తదితర అంశాలపై ప్రణాళిక బద్దంగా ముందుకు సాగుతూ పాఠశాలను నేడు ఆదర్శంగా తీర్చిదిద్దారు. 2015-16 విద్యాసంవత్సరం నుంచి ఇప్పటివరకు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రత్యేక పర్యవేక్షణతో ఎనిమిదేండ్లుగా వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్న ప్రిన్సిపాల్ సరోజన అనేక అవార్డులు అందుకున్నారు. ప్రత్యేక ప్రణాళికతోపాటు ఉపాధ్యాయుల కృషే ఇందుకు కారణమని ప్రిన్సిపాల్ తెలిపారు. అదే స్ఫూర్తితో ఈ విద్యాసంవత్సరం కూడా వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

### ఎనిమిదేండ్లుగా వంద శాతం ఫలితాలు

గత ఎనిమిదేండ్లుగా నిజాంసాగర్ కస్తూర్బా పాఠశాల ఎస్సెస్సీలో వందశాంతం ఫలితాలు సాధించగా, ఈ ఏడాది రాబోయే వార్షిక పరీక్షలో 42 మంది విద్యార్థినులు పరీక్షలకు సిద్ధం అవుతున్నారు. వీరికి ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు, రెండు రోజులకోసారి స్లిప్ టెస్టులు నిర్వహిస్తున్నారు. చదువులో వెనుబడిన బాలికలపై ప్రత్యేక శ్రద్ధపెట్టి పరీక్షలకు సంసిద్ధం చేస్తున్నారు.

| సంవత్సరం | విద్యార్థుల సంఖ్య | ఉత్తీర్ణత |
|---|---|---|
| 2015-16 | 33 | 100% |
| 2016-17 | 44 | 100% |
| 2017-18 | 37 | 100% |
| 2018-19 | 42 | 100% |
| 2019-20 | 47 | 100% |
| 2020-21 | 45 | 100% |
| 2021-22 | 44 | 100% |
| 2022-23 | 41 | 100% |

### అందరి కృషితోనే విజయం



సమష్టి కృషితోనే ఎనిమిదేండ్లుగా వందశాతం ఫలితాలు సాధించాం. ఇప్పుడు కూడా అదే స్ఫూర్తితో ముందుకు సాగుతున్నాం. అందుకోసం ప్రతి రోజూ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం.

-సరోజన, ప్రిన్సిపాల్

### పది గ్రేడ్ పాయింట్లు సాధిస్తా



కచ్చితంగా పది గ్రేడ్ పా యింట్లు సాధిస్తా. మా టీచ ర్లు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం స్పెషల్ క్లాసులు చెబుతారు. రెండురోజులకోసారి పరీక్షలు పెట్టి డౌట్స్ క్లియర్ చేస్తారు. ఈ సంవత్సరం కూడా మా త రగతిలో అందరం మంచి మార్కులతో పాసవుతాం.

-సన్నుత, పదో తరగతి

## జీపీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలి

సదాశివనగర్, మార్చి 17: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు. సదాశివనగర్‌లోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, జీవో 51ని సవరించాలని కోరారు. ఈనెల 21వ తేదీన రాజధానిలోని కమిషనర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జీపీ కార్మికులు బాల్‌నర్సు, సాయిలు, మల్లేశ్, శ్రీను, రవి, ఎల్లయ్య, సంగమేశ్వర్, స్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## నీటి ట్యాంకులో కప్పలు

ఎల్లారెడ్డి, మార్చి 17: మండలంలోని మొగులాన్‌ఖేడ్ గ్రామంలోని నీటి ట్యాంకులో కప్పలు ఉండడంతో నీటి నుంచి దుర్వాసన వస్తున్నదని గ్రామస్తులు తెలిపారు. మండలస్థాయి అధికారులు స్థానిక సిబ్బందిని అప్రమత్తం చేయాలని కోరుతున్నారు. నీటి ట్యాంకులో నుంచి ఆదివారం నీటిని తీయగా చనిపోయిన కప్పలు కనిపించాయి. దీంతో గ్రామస్తులు స్థానిక గ్రామ పంచాయతీ సిబ్బందిని మందలించారు.



వాటర్ ట్యాంకు నుంచి బయటికి తీసిన కప్పలు

## విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



రాజు(ఫైల్)

గాంధారి, మార్చి17: విద్యుత్‌షాక్‌కు గురై యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని గండివేట్ గ్రామంలో చోటుచేసుకున్నది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. గండివేట్ గ్రామానికి చెందిన పెద్దాపురం రాజు (18) ఆదివారం తమ వరి పంటకు నీరు పెట్టడానికి వెళ్లాడు. బోరుమోటర్ స్టార్ట్ చేస్తుండగా.. ప్రమాదవశాస్తు స్టార్టర్ డబ్బా వద్ద ఉన్న విద్యుత్ వైరు చేతికి తగిలింది. దీంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించాడు. మృతుడి తండ్రి గంగారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. రాజు మృతితో గ్రామంలో విషాదం నెలకొన్నది.